అనాథ చిన్నారులకు ఎల్లవేళలా అండగా ఉంటా.. 8

స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి 8

కానరాని కోడిగుడ్లు



- కస్తూర్బా, మోడల్ స్కూళ్లకు నిలిచిన సరఫరా
- నెలరోజులుగా విద్యార్థులకు అందని పౌష్టికాహారం
- గిట్టు బాటు కాదని చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని అధికారులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఉడక బెట్టిన కోడిగుడ్డులో ప్రొటీన్, యాంటి అక్సిడెంట్లు, ఎసెన్షియల్ మినరల్స్, అమినో యాసిడ్స్, విటమిన్ డి, బి-12 ఉంటాయి. కోడిగుడ్డులో ఉండే పచ్చసొనలో విటమిన్ ఏ,బి,ఇ,కె ఉంటాయి. అధిక శక్తిని ఇవ్వడంతో పాటు రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. అది మంచి పౌష్టికాహారం కావడంతో ప్రభుత్వ గురుకులాలు, హాస్టళ్లలో, మధ్యాహ్నం భోజనంలో విద్యార్థులకు కోడిగుడ్డు పెడుతున్నారు. అయితే దాదాపు నెల రోజుల నుంచి జిల్లాలో కొన్ని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, మోడల్ స్కూళ్లలో కోడిగుడ్లు కానరావడం లేదు. దీంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదు. తమకు ఇచ్చే ధర గిట్టుబాటు కాదని కాంట్రాక్టర్లు కోడిగుడ్లు సరఫరా చేయకపోయినా కూడా జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తున్నది. జిల్లాలోని ధర్మారం, సుల్తానాబాద్, జూలపల్లి, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం, రామగుండం, అంతర్గాం, రామగిరి, పాలకుర్తి మండలాల్లో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ఉండగా, పెద్దపల్లిలో ఒకటి అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ఉంది. సుల్తానాబాద్, ధర్మారం, జూలపల్లి, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ముత్తా రం, రామగుండంలో మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఈ స్కూళ్లలో 100మంది బాలికలకు వసతి గృహ సౌకర్యం కల్పించారు. వీటిలో మెనూ అమలు చేసేందుకు కూర గాయలు, కోడిగుడ్లు, చికెన్, కిరాణ సరుకులు, తదితర సరఫరా చేసేందుకు జూన్ 22వ తేదీన టెండర్లను ఆహ్వానించారు. జూన్ 29వ తేదీ వరకు టెండర్ల దాఖ లుకు గడువు విధించి జూన్ 1వ తేదీన టెండర్లు తెరి చి ఖరారుచేశారు. కోడిగుడ్ల సరఫరా బాధ్యతను నలుగురైదుగురు కాంట్రాక్టర్లకు అధికారులు అప్పగించారు. ఒక్కో కోడిగుడ్డును 5 రూపాయలకు సరఫరా చేయాలని పేర్కొన్నారు. ఆ ధరకు తమకు గిట్టుబాటు కాదని, 6 రూపాయలైనా ఇవ్వాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వ మే 5 రూపాయల 50 పైసలకు కోడిగుడ్లను సరఫరా చేస్తు న్నదని పేర్కొన్నారు. కానీ అధికారులు ధర పెంచకపో వడంతో మూడు, నాలుగు స్కూళ్లకు మినహా మిగతా స్కూళ్లు, గురుకులాలకు కాంట్రాక్టర్లు కోడిగుడ్లను సరఫరా చేయలేక చేతులెత్తేశారు.



ముత్తారం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

● అధికారుల పర్యవేక్షణ లోపం..

ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఒక కోడిగుడ్డు ధర 6 రూపాయలు పలుకుతున్నది. విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయంలో వారానికి 4 కోడిగుడ్లు పెట్టాల్సి ఉండగా, ఒక్క కోడిగుడ్డు కూడా అందించడం లేదు. కాంట్రాక్టర్ సరఫరా చేయకపోతే ప్రత్యామ్నాయంగా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీంతో పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్నారు. సెలవుల్లో తమ ఇళ్లకు వెళ్లినప్పుడే విద్యార్థులు కోడిగుడ్లను తినాల్సిన పరిస్థితి. అలాగే కస్తూర్బా గురుకులాలు, మోడల్ స్కూళ్లలో మెనూ ప్రకారం భోజనాలు, అల్పాహారం అందించడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. అప్పుడు భోజనంలో లక్క పురుగులు వస్తున్నాయని చెబుతున్నారు. ఈ స్కూళ్లపై జిల్లా విద్యా శాఖ అధికారుల పర్యవేక్షణ లేక విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందడం లేదు. అప్పుడప్పుడు వాటిని ఆకస్మికంగా తనిఖీ చేస్తే లోపాలు బయట పడతాయనే అభిప్రాయాలు ఉన్నాయి. తనిఖీలు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సరుకుల సరఫరా చేసే టెండర్లను దక్కించుకున్న కాంట్రాక్టర్లు టెండర్‌లో పేర్కొన్న ప్రకారం నాణ్యమైన సరుకులను సరఫరా చేయకపోవడంతో వంట సిబ్బంది రుచికరమైన వంటలను వండ లేకపోతున్నారు. ఈ విషయమై కలెక్టర్ స్పందించి కస్తూర్బా విద్యాలయాలు, మోడల్ స్కూళ్ల విద్యార్థులకు కోడిగుడ్లు అందే విధంగా చర్యలు తీసుకోవాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

బామ్లానాయక్ తండాలో న్యాయ సదస్సు

పాలకుర్తి, ఆగస్టు 9: మండలం పరిధిలోని బామ్లానాయక్ తండాలో శుక్రవారం గిరిజనుల హక్కుల పరిరక్షణ, వాటి పరిష్కారం కోసం జిల్లా లీగల్‌సర్వీస్ అథారిటీ న్యాయ సదస్సును నిర్వహించింది. కార్యక్రమానికి హాజరైన జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ అథారిటీ సెక్రెటరీ స్వప్నరాణి గిరిజనుల హక్కులు, చట్టాల అమలు తదితర విషయాలను వివరించారు. బాల్య వివాహలను అరికట్టాలని, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా పిల్లలను చూసుకోవాలని, పిల్లలను ఉన్నత చదువులు చదివించాన్నారు. వృద్ధుల పట్ల సహనంగా ఉండాలన్నారు. తాజా మాజీ సర్పంచ్ రాజునాయక్, న్యాయవాదులు నరెష్, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి అనీల్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది, బదావత్ సారయ్య, భూక్య రాజేష్, ఇస్లావత్ సమ్మయ్య, రాములు నాయక్, జుమ్మిలాల్, మూడు రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మార్కండేయకాలనీ, ఆగస్టు 9: విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ అడిచర్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాంమందిర్, పీజీ సెంటర్, గౌతమినగర్, జనగామ, అల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీలైన్ మరమ్మతుల్లో భాగంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సుల్తానాబాద్, ఆగస్టు 9: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్లలో నెలవారీ మరమ్మతుల దృష్ట్యా శనివారం మధ్యాహ్నం వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు కనుకుల, సుల్తానాబాద్ అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్లు రంగు శంకరయ్య, మానాల ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నారాయణపూర్, కనుకుల, రేగడిమద్దికుంట సబ్‌స్టేషన్లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : కలెక్టర్ శ్రీహర్ష

రామగిరి, ఆగస్టు 9: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా గుర్తించాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. సింగరేణి సంస్థ ఆర్జీ-3 యాజమాన్యం శుక్రవారం చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-2 డంప్ యార్డ్‌పై మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వనమహోత్సవం ద్వారా నాటిన ప్రతి మొక్క సంరక్షణ బాధ్యతలు చేపట్టేందుకు ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేయాలని సూచించారు. వన మహోత్సవం ద్వారా సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలో 147.6 హెక్టార్లలలో మొక్కలు నాటాలని లక్ష్యలను నిర్దేశించుకున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగా ఓబీ వద్ద 23 హెకార్లు, బ్లాక్ ప్లాంటేషన్ కింద 121.6 హెక్టార్లు అవెన్యూ ప్లాంటేషన్ కింద 3కిలోమీటర్ల మేర మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించి ఇప్పటి వరకు 70 వెల 480 మొక్కలు నాటడం జరిగిందన్నారు. సింగరేణి పరిధిలో గ్రీనరీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 616 హెక్టార్లలలో పది లక్షల మొక్కలు నాటడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అరుశ్రీ, డీఎఫ్‌వో శివయ్య, జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, అధికారులు రఘుపతి, కర్ణ, వివిధ విభాగాల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.




మొక్క నాటుతున్న కలెక్టర్ శ్రీహర్ష

కరీంనగర్‌లో సీఎంఆర్ సందడి

- షాపింగ్ మాల్ ప్రారంభం
- ఆకట్టుకున్న సినీతారలు పాయల్ రాజ్‌పుత్, సంయుక్త మీనన్

కరీంనగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద వస్త్ర వ్యాపార సంస్థ సీఎంఆర్ గ్రూప్ 32వ షాపింగ్ మాల్‌ను ఐఎంఏ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు, భూంరెడ్డి హాస్పిటల్స్ యజమాని డాక్టర్ వి.భూంరెడ్డి చేతుల మీదుగా కరీంనగర్‌లో అట్టహాసంగా ప్రారంభించారు. గురువారం జరిగిన షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి డాక్టర్ వి.భూంరెడ్డి, చల్మెడ మెడికల్ కళాశాల చైర్మన్ చలిమెడ లక్ష్మీనర్సింహారావు, డాక్టర్ వి.రమాదేవి, కరీంనగర్ ఆర్యవైశ్య సేవా కేంద్రం అధ్యక్షుడు, లయన్ చిదుర సురేశ్ హాజరై మొదటి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా సీఎంఆర్ ఫౌండర్ చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ తమ సంస్థను గత 40 సంవత్సరాలుగా తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆదరిస్తున్నారని, కరీంనగర్‌లో 32వ షోరూంను ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. సీఎంఆర్‌లో ప్రపంచస్థాయి అనుభూతి కలిగేలా ఉంటుందని అన్నారు. అన్ని రకాల వేడుకలకు అన్ని మోడల్స్‌లో కుటుంబమంతటికీ నచ్చే విధంగా వస్త్రాలు అన్ని వర్గాల ప్రజలకు అతి తక్కువ ధరలకే అందించడం మా ప్రత్యేకత అన్నారు. సొంత మగ్గాలపై నేయించిన వస్త్రాలను మార్కెట్‌లో మరెవ్వరూ ఇవ్వని ధరలకు సీఎంఆర్‌లో అందిస్తున్నామని చెప్పారు. సీఎంఆర్ ఎండి మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ సీఎంఆర్ అంటే ది వన్ స్టాప్ షాప్ అంటే ఫ్యామిలీ అందరికీ నచ్చే విధంగా అన్ని రకాల వెరైటీలు, డిజైన్లు లభిస్తాయని అన్నారు. అందరికీ అందుబాటు ధరలలో లక్షలలో డిజైన్లలో, వేలల్లో వెరైటీలు తమ వద్ద లభిస్తాయని చెప్పారు. ప్రముఖ సినీతారలు పాయల్ రాజ్‌పుత్, సంయుక్త మీనన్ జ్యోతి ప్రజ్వలన చేసి షాపింగ్ మాల్‌లోని అన్ని సెక్షన్లలో తిరుగుతూ అన్ని రకాల డిజైన్లను పరిశీలిస్తూ సందడి చేశారు. 40 ఏళ్లుగా వస్త్ర వ్యాపార రంగంలో క్వాలిటీకి, డిజైన్లకు ప్రత్యేకతనిస్తూ తెలుగురాష్ట్రాల్లో అగ్రగామిగా సీఆర్ఎస్ నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా అభిమానులను ఆటపాటలతో డ్యాన్సులతో ఉర్రూతలూగించారు.



సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ భూంరెడ్డి సతీమణి, డాక్టర్ సూర్యనారాయణ, చల్మెడ లక్ష్మీనరసింహారావు

నటీమణులను చూసేందుకు వచ్చిన అభిమానులు

ఫాగ్‌ను స్ప్రే చేస్తున్న పాయల్ రాజ్‌పుత్

అభిమానులకు అభివాదం చేస్తున్న సినీ నటి సంయుక్త మీనన్

స్వాతంత్ర్య వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు..

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహించే స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య వేడుకలు జరుగుతాయని, జిల్లాలోని ప్రతి శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరుకావాలని అదనపు కలెక్టర్ తెలిపారు. స్వాతంత్ర్య వేడుకలకు సంబంధించి ఫ్లాగ్ ఏర్పాట్లు, గ్రౌండ్ సిద్ధం చేయడం మొదలగు ఏర్పాట్లు పోలీస్‌శాఖ, రెవెన్యూశాఖ అధికారులు సమన్వయంతో పూర్తిచేయాలన్నారు. స్వాతంత్ర్య వేడుకల డయాస్, సీటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ప్రొటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, దీనిని అప్రమత్తంగా నిర్వహించాలని అన్నారు. పెద్దపల్లి పట్టణంలోని స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు హాజరయ్యేలా మెప్మా అధికారులు చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఏఎన్ఎం ఆధ్వర్యంలో వైద్య బృందాలచే శిబిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ముఖ్య అతిథి అందించే సందేశం రూపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల వివరాలను క్లుప్తంగా ఆగస్టు 12నాటికి అందజేయాలని అన్నారు. స్వాతంత్ర్య వేడుకల అవసరమైన మేర తాగునీటి క్యాన్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మున్సిపల్ కమిషనర్ సమన్వయంతో ఏర్పాటుచేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలకు సంబంధించి స్టాల్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది ప్రశంసా పత్రాలు అందజేసేందుకు ప్రతిపాదనలు ఆగస్టు 12లోపు పంపాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో ఆర్‌డీఓ బి గంగయ్య, పెద్దపల్లి ఏసీపీ జి కృష్ణ, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్

కోర్టు కానిస్టేబుల్ బాధ్యతలు చాలా కీలకం : సీపీ

కోల్‌సిటీ, ఆగస్టు 9: కోర్టు కానిస్టేబుల్ బాధ్యత చాలా కీలకమైనదని, నేరరహిత సమాజంగా తీర్చిదిద్దాలంటే నిందితులకు కోర్టులో శిక్షపడే విధంగా కోర్టు డ్యూటీ పోలీసు సిబ్బంది శ్రమించాలని రామగుండం పోలీస్ కమీషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. ఇందుకోసం ఎఫ్ఐఆర్ నమోదు అయినప్పటి నుంచి కేసు పూర్తయ్యేంతవరకు నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన రుజువులు, పత్రాలు, సాక్షుల వాగ్మూలంను కోర్టుకు సమర్పించడంలో కోర్టు కానిస్టేబుల్ ప్రత్యేక శ్రద్ధ, బాధ్యత తీసుకోవాలని సీపీ సూచించారు. శుక్రవారం కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న కోర్టు డ్యూటీ ఆఫీసర్స్, లైసెన్‌ఆఫీసర్స్‌తో కమిషనరేట్‌లో సీపీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ కోర్టు డ్యూటీ ఆఫీసర్లు నేరస్థులు శిక్షల నుంచి తప్పించుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించి నేరస్తులకు శిక్షలు పడేందుకు కృషి చేయాలన్నారు. కోర్టు కానిస్టేబుల్ కోర్టు క్యాలండర్ తయారు చేసుకోవాలని, నిందితులకు శిక్షలుపడేటట్టు సాక్షులను మోటివేషన్ చేయాలన్నారు. ప్రతి కేసులో పారదర్శక విచారణ ఉండాలని, షెడ్యూల్ ప్రకారం సాక్షులను కోర్టులో హాజరుపర్చాలని సూచించారు. పెండింగ్, పెట్టి కేసులు వెంటనే డిస్పోజల్ చేయాలని, నేరస్తులకు శిక్షలు పడితే నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. కోర్టువారెంట్స్, సమన్స్, ఎంసీస్ వర్టికల్స్ గురించి పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కోర్టు కానిస్టేబుల్ అధికారులు తమ విధిలో భాగంగా ఎప్పటికప్పుడు నాన్ బేలబుల్ వారెంటులను క్రమం తప్పకుండా అమలుపరిచి నేరస్తులకు శిక్షలు పడేవిధంగా కృషి చేయాలన్నారు. అదనపు డీసీపీ(అడ్మిన్) సీ రాజు, గోదావరిఖని ఏసీపీ రమేష్, పెద్దపల్లి ఏసీపీ జీ కృష్ణ, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు,ఏసీపీ ప్రతాప్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ బుద్దె స్వామి, కోర్టు డ్యూటీఆఫీసర్స్ పాల్గొన్నారు.

బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, ఆగస్టు 9: మండలంలోని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై శుక్రవారం తాడికల్ గ్రామ శివారులో బైక్‌ను బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు తిమ్మాపూర్ మండలం పర్లపల్లికి చెందిన ఏనుగుల శ్రీనివాస్ కేశవపట్నం నుంచి కరీంనగర్ వైపుకు బైక్‌పై వెళ్తున్నాడు. తాడికల్ శివారులో కరీంనగర్ నుంచి వరంగల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108లో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అకడమిక్ డీఎంఈ రాజీనామా!

» ఆ పోస్టు తనకొద్దంటూ సర్కారుకు శివరాంప్రసాద్ లేఖ

» కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు తేవాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి!

» అది భరించలేకనే తప్పుకొన్న శివరాం?

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడు డాక్టర్ శివరాంప్రసాద్ తన పదవికి రాజీనామా చేశారు. తనను ఆ పోస్టు నుంచి తప్పించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాను అకడమిక్ డీఎంఈగా విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నానని లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య సంచాలకుల పరిధిలో జరిగిన సాధారణ బదిలీల కంటే ముందే ఆయన సర్కారుకు రాజీనామా లేఖను పంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొద్ది రోజులుగా ఆయన డీఎంఈ కార్యాలయానికి కూడా రావడం లేదు. వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడిగా తీవ్రమైన పనిభారం, ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేకనే ఆ పోస్టు నుంచి తప్పుకొన్నారని శివరాంప్రసాద్ సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్తగా 8 వైద్య కళాశాలల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, అధ్యాపకులు, సౌకర్యాల లేమి కారణంగా 8 కాలేజీలకు జాతీయ వైద్య మండలి అనుమతి ఇవ్వలేదు. దీనిపై డీఎంఈ కార్యాలయం అప్పీలుకు వెళ్లగా.. నాలుగింటికి అనుమతులు వచ్చాయి. మరో నాలుగు పెండింగ్‌లో ఉన్నాయి. ఎలాగైనా సరే వాటికి అనుమతులు తీసుకురావాల్సిందేనని ఉన్నతాధికారులు డీఎంఈ కార్యాలయంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అది భరించలేకనే ఆయన అకడమిక్ డీఎంఈ పదవి నుంచి వైదొలగినట్లు తెలుస్తోంది.

ప్రాణం తీసిన ఇన్‌స్టా స్నేహం

» ప్రేమ పేరిట యువకుడి వేధింపులు.. బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య



తేజస్విని (ఫైల్)

గుమ్మడిదల, ఆగస్టు 9: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో చేసిన స్నేహం ఓ యువతి ప్రాణాలు తీసింది. ప్రేమ పేరుతో ఆ యువకుడి వేధింపులు భరించలేక ఓ బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తమ ఇంటి భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన రాజు, సోనీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె తేజస్విని(20) ఉన్నారు. బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న తేజస్వినికి అదే గ్రామానికి చెందిన శ్రీహరి కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. కొద్ది రోజుల తర్వాత తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని శ్రీహరి వేధించడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై తేజస్విని కుటుంబసభ్యులను కూడా బెదిరించాడు. దీంతో తేజస్విని ఇంట్లో నాలుగు రోజుల క్రితం కూడా గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీహరి వేధింపులు తాళలేకపోయిన తేజస్విని గురువారం రాత్రి తమ ఇంటి భవనం మూడో అంతస్తు నుంచి దూకేసింది. రక్తపుమడుగులో పడి ఉన్న తేజస్విని కుటుంబసభ్యులు హుటాహుటిన సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించింది.

పీర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం

పీర్జాదిగూడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఖాతాలోకి మరో మునిసిపల్ కార్పొరేషన్ చేరింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం నగర పాలక మండలి సమావేశం జరిగింది. మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా.. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది ఓటు వేశారు. దీంతో మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లుగా ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే మేయర్ ఎన్నికకు తేది ఖరారు అయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు కొనసాగిన అరాచక పాలనకు తెరపడిందని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 12వ డివిజన్ కార్పొరేటర్ అమర్‌సింగ్‌ను తమ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి

» అర్ధరాత్రి ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత

» తెల్లవారుజామున ఆస్పత్రికి తరలింపు

» ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం

» టీచర్ల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ



అనిరుధ్ (ఫైల్)

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 9: అర్ధరాత్రి అస్వస్థతకు గురైన ఇద్దరు గురుకుల విద్యార్థులను తెల్లవారుజామున ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందగా.. మరొకరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎలమాడల అనిరుధ్ (11), జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మొండి మోక్షిత్ గురుకులంలో ఆరోతరగతి చదువుతున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి నిద్రపోయారు. అయితే అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో పీఈటీ వెళ్లగా.. కడుపు నొప్పిగా ఉందని అనిరుధ్, మోక్షిత్‌లు తెలిపారు. దీంతో వెంటనే కేర్‌టేకర్‌లు, అనిరుధ్ తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి వారిని కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం విషమంగా ఉందని తెలపడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పతికి తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలిసి వైద్యుడు కూడా అయిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్.. విద్యార్థులు పాము కాటుకు గురై ఉండవచ్చని అందుకు తగిన వైద్యం చేయాలని ఆర్మూర్‌లో వైద్యులకు సూచించారు. అక్కడ వైద్యం అందించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అనిరుధ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోక్షిత్ పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. ఇటు పాఠశాలలో ప్రార్థనా సమయంలోనే ఆరో తరగతి చదువుతున్న హేమంత్ అనే మరో విద్యార్థి కూడా కళ్లు తిరుగుతున్నాయని కింద పడిపోయాడు. గమనించిన ఉపాధ్యాయులు మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, 2 వారాల క్రితం ముగ్గురు విద్యార్థులు ఇదే విధంగా అస్వస్థతకు గురయ్యారు. వీరిలో చికిత్స అనంతరం ఇద్దరు కోలుకోగా.. 8వ తరగతి చదివే ఆర్.గణాధిత్య (13) మృతి చెందాడు. అయితే వీరు పాము కాటుకు గురైనట్లు సమాచారం.

ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం..

విద్యార్థి అనిరుధ్ మృతి విషయం తెలిసి కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గురుకులానికి చేరుకున్నారు. విద్యార్థి మృతికి కారణాలేంటని అక్కడి ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అయితే తమకేం తెలియదని వారు సమాధానం చెప్పడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, విద్యార్థుల వరుస మరణాలకు ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో వసతులు సరిగా లేవని.. తమ పిల్లల భద్రత మాటేంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

పూడికతీతతో పూర్వస్థితి

ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడిక తీయాలి

» వచ్చే ఇసుకతో ప్రభుత్వానికి ఆదాయం

» మట్టిని రైతులకు ఉచితంగా ఇవ్వాలి

» 14లోగా ప్రతిపాదనలు అందించాలి

» మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం



ప్రాజెక్టుల్లో పూడికతీతపై సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడికతీత పనులు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ప్రాజెక్టుల రక్షణలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ ఉండరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులకు ఏటా వచ్చే భారీ వరదతోపాటు పూడిక కూడా వచ్చి చేరుతోందని తెలిపింది. దీంతో ప్రాజెక్టుల సామర్థ్యం తగ్గుతున్నందున.. పూడికతీతతో పూర్వస్థితిని పునరుద్ధరించాలని సూచించింది. శుక్రవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. పూడికతీతకు ఏయే చర్యలు తీసుకోవచ్చనే దానిపై నీటిపారుదల, మైనింగ్ శాఖలు సమగ్ర నివేదిక రూపొందించి, 14లోగా అందించాలని మంత్రివర్గం ఆదేశించింది. పూడిక వల్ల డ్యామ్ సేఫ్టీ సమస్యలు తలెత్తడంతోపాటు ఆయకట్టు తగ్గిపోతోందని, తాగునీటి అవసరాలపైనా దీని ప్రభావం పడుతుందని మంత్రులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో పూడికతీతకు పర్యావరణ అనుమతి అవసరంలేదని కేంద్రం చెప్పినందున..దానికనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పూడికలో ఇసుక ఉంటే నిర్మాణ అవసరాలకు వినియోగించుకోవాలని, సారవంతమైన మట్టి ఉంటే రైతాంగానికి ఉచితంగా అందించాలని సూచించారు. పూడికను రైతులే స్వయంగా తీసుకెళ్లేలా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.

35 టీఎంసీల నిల్వను కోల్పోయాయి!

మహారాష్ట్ర, రాజస్థాన్‌లో వాణిజ్య అవసరాలకు ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాజెక్టుల్లోని పూడికను వినియోగించుకుంటున్నారని అధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి తెలిపారు. యంత్రాల సహాయంతో డ్రెడ్జింగ్ చేస్తూ పూడిక తీస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కింద 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు 35 టీఎంసీల నిల్వను కోల్పోయినట్లు తేలిందని నివేదించారు. ఏటా పూడిక తీతకు టెండర్లు పిలిచి ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తే.. ఇసుక తరలింపుతో ట్యాక్స్, సెస్, జీఎస్టీ, ఇతర రాయల్టీలతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అన్నారు. పూడిక వల్ల జలాశయాలు ఏటా 0-5 శాతం నిల్వలను కోల్పోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 25 ఏళ్లకు పైగా నిండిన జలాశయాలున్నాయని, ప్రయోగాత్మకంగా కొన్నింట్లో పూడికతీత చేపట్టి.. ఆ తరువాత మొత్తం 159 జలాశయాల్లో అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను మింగుతున్న పూడిక

ఏటా వరదల సమయంలో జలాశయాల్లోకి నీటితోపాటు పూడిక వచ్చిచేరుతుండడంతో ప్రాజెక్టుల సామర్థ్యం ఏయేటికాయేడు తగ్గిపోతోంది. ఈ పూడిక.. ప్రాజెక్టుల ఆయుష్షును కూడా తగ్గిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్‌ను 1923లో అప్పటి నిజాం ప్రభుత్వం నిర్మించగా... ఈ ప్రాజెక్టు 1967 నాటికీ 52.10 శాతం సామర్థ్యం కోల్పోయింది. అప్పట్లో నిజాంసాగర్‌కు ఎగువన ప్రాజెక్టులే లేకపోవడంతో వచ్చే వరద పూడికతో సహా జలాశయంలో చేరడంతో ప్రాజెక్టు సామర్థ్యం సగానికి పైగా తగ్గింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2016లో నిర్మించిన ర్యాలివాగు సామర్థ్యం 43.30 శాతం మేర తగ్గింది. శ్రీశైలం ప్రాజెక్టు 1976లో అందుబాటులోకి రాగా... 45 ఏళ్లలో పూడిక కారణంగా 29.96 శాతం మేర నీటినిల్వ సామర్థ్యం కోల్పోయింది. ఇక నాగార్జునసాగర్ 23.52 శాతం నిల్వ సామర్థ్యం తగ్గింది. మొత్తంగా రాష్ట్రంలో 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 భారీ రిజర్వాయర్లు ఉండగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించారు. ఇందులో ఈ ప్రాజెక్టుల సామర్థ్యం 35 టీఎంసీల మేర కోల్పోయిందని గుర్తించారు. ప్రాజెక్టుల్లో పూడిక చేరకుండా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నదీ తీర ప్రాంతాలు కోతకు గురికాకుండా మొక్కల పెంపకం వంటి చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ నిపుణులు సూచిస్తున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వాటిని పూడిక మింగుతోంది. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మించాలంటే భూసేకరణ, నిర్మాణ ఖర్చులు కలిపి రూ.162 కోట్లు అవుతాయని లెక్క ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో ఎన్‌హెచ్‌పీ కింద అధ్యయనం చేసిన జలాశయాలు రూ.5670 కోట్ల మేర నష్టపోయాయి.

నిర్మల్ వాసి ఆడు జీవితం

» సౌదీలో ఒంటెల కాపరిగా నామ్‌దేవ్

» రక్షించాలంటూ సెల్ఫీ వీడియో

» టీజీఎండీసీ చైర్మన్ అనిల్ ట్వీట్‌తో భారత ఎంబసీ స్పందన

» నామ్‌దేవ్ ఆచూకీ గుర్తించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దళారుల మాటలు నమ్మి భారత్ నుంచి సౌదీ అరేబియా వెళ్లి ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేసే ఓ వ్యక్తి దుర్భర జీవితం ఇతివృత్తంగా ఇటీవల ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. తెలంగాణలోని నిర్మల్ జిల్లాకు చెందిన రాథోడ్ నామ్‌దేవ్(51) అనే వ్యక్తి ఆ సినిమాలో మాదిరిగా సౌదీ ఎడారిలో దుర్భర జీవితం గడుపుతున్నాడు. ఈ కష్టాల నుంచి రక్షించండి అని వేడుకుంటూ నామ్‌దేవ్ ఇటీవల సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పెట్టడంతో ఈ విషయం బయటికొచ్చింది. నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు స్పందన రావడంతో అతను స్వదేశానికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) చైర్మన్ ఈరవత్రి అనిల్ స్పందించారు. నామ్‌దేవ్‌ను సురక్షితంగా స్వదేశానికి చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి, కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులను ఎక్స్(ట్విటర్) ద్వారా కోరారు. దీంతో కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులు నామ్‌దేవ్‌ను సంప్రదించారు. కువైత్ సరిహద్దులోని సౌదీ అరేబియా ఎడారిలో నామ్‌దేవ్ ఉన్నట్టు గుర్తించారు. చాలా కాలంగా గల్ఫ్‌లో ఉంటున్న నామ్‌దేవ్‌ను అతని యజమాని పది నెలల క్రితం సౌదీలోని ఒంటెల క్షేత్రానికి తరలించినట్టు తెలిసింది. కాగా, సౌదీ, కువైత్‌లోని ప్రవాసీయులు నామ్‌దేవ్‌ను సంప్రదించేందుకు యత్నించగా అతని ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. నామ్ దేవ్‌ను ఏ విధంగా స్వదేశానికి పంపిస్తారో తెలియాల్సి ఉంది.

ఉపాధి నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, పెద్దపల్లిటౌన్, ఆగస్టు 9: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీసీ నిరుద్యోగ యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు వెబ్ సైట్ rcle.cgg.gov.in లో ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని కుషాయిగూడలో ఎలీ హోప్ టెక్నికల్ స్కిల్స్ అకాడమీ ఆధ్వర్యంలో 100 మంది అభ్యర్థులకు 90 రోజుల పాటు నాన్ రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలం పూర్తయిన తర్వాత అకాడమీ వారే ఉద్యోగాలు కల్పిస్తారని తెలిపారు.శిక్షణ కాలంలో ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.4వేల చొప్పున భృతిని సంస్థ అందిస్తుందన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన 18 నుంచి 25 ఏళ్ల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదోతరగతి మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. కుటుంబ వార్షికాదాయం 5 లక్షల రూపాయలలోపు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 0878-2268686 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పాలిసెట్ స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 9: జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రభుత్వ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన ఖాళీలను పాలిసెట్-24 స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేసేందుకు అర్హులైన, ఔత్సాహిక విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదీ వరకు దరఖాస్తులను కళాశాల ప్రధానాచార్యులకు సమర్పించాలని, దరఖాస్తుతోపాటు ఎస్సెస్సీ మెమో, పాలిసెట్-24 ర్యాంకు కార్డు, కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఒరిజినల్ టీసీ జత చేయాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్‌లో సీటు పొందిన వారు పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు అనర్హులని తెలిపారు.

హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా ఖని వాసి



కొమిమెర సాయి ఆకర్ష్

కోల్‌సిటీ, ఆగస్టు 9: హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా గోదావరిఖని సీతానగర్‌కు చెందిన కొమిమెర సాయి ఆకర్ష్‌ను నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. గోదావరిఖనికి చెందిన సాయిఆకర్ష్ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. ఎనిమిది సంవత్సరాలుగా హైకోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్నారు. క్రమ శిక్షణ, అంకిత భావాన్ని గుర్తించిన న్యాయ శాఖ హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా నియమించింది. తన నియామకానికి కృషి చేసిన అడిషనల్ అడ్వకేట్ జనరల్ రజినికాంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. సాయిఆకర్ష్‌ను ఏజీపీగా నియమించడంపై గోదావరిఖని బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

ఇల్లందకుంట, ఆగస్టు 9: మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన రేణికుంట్ల రాధమ్మ (70) చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. రాధమ్మ గురువారం ఉదయం ఇంటి ముందు జారీ పడగా తలకు తీవ్ర గాయమైంది. వెంటనే జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎం తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రవీందర్‌రెడ్డి తెలిపారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న నీటి తరలింపు


పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట,ఆగస్టు9: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 3,602 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. పాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.846 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక వరద తగ్గుముఖం పట్టడంతో ఒక్క మోటార్ ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు.

రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ నుంచి మిడ్ మానేరులోకి ఒక మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. గాయత్రీ పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 13 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు. మిడ్‌మానేరు నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 17.15 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 1.22 టీఎంసీల నీరు చేరింది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో రెండు పంపుల ద్వారా 6,400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి 6600 క్యూసెక్కుల నీటిని సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

కాకతీయ కాలువకు కొనసాగుతున్న నీటి విడుదల

జగిత్యాల: వానాకాలం పంటల సాగు కొరకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను శుక్రవారం అధికారులు కొనసాగించారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 3,000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 3,793 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 47.25 టీఎంసీల నీరు ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 76.894 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువకు 3 వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 10 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 50 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతున్నాయి.


మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో శిశువు మృతి



ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

సుభాష్‌నగర్, ఆగస్టు 9: జిల్లా ఆసుపత్రి ఆవరణలోగల మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో శిశువు మృతి చెందిన సంఘటన జరిగింది. వైద్యులు సిబ్బంది కారణమంటూ బంధువులు ఆందోళన చేశారు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్‌కు చెందిన పల్లె ప్రదీప్ తన భార్య లావణ్యను కాన్పు కోసం ఈనెల 8న మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చేర్పించాడు. అడ్మిట్ చేసిన రోజునే నొప్పులు వచ్చినప్పటికీ ప్రసవం చేయలేదని ఆరోపించారు. శుక్ర వారం ఉదయం ఆరు గంటలకు ఆపరేషన్ చేయగా ఆడ శిశువుకు జన్మనించిందని తెలిపా రు. అయితే నొప్పులు వచ్చినపుడు కాకుండా ఆలస్యంగా ఆపరేషన్ చేయడంతో గర్భంలో ఉన్న శిశువు మల మూత్రాలు మింగడం వల్ల పాప చనిపోయిందని ఆరోపించారు. డాక్టర్లు, సిబ్బంది ఆలస్యం చేయడం వల్లనే తమ పాప చనిపోయిందని ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని బాలిక మృతి



బాలిక మృతదేహం

శంకరపట్నం, ఆగస్టు 9: శంకరపట్నం మండలం కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సమీపంలో కరీంనగర్-వరంగల్ రహదారిపై తెల్లవారు జామున గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు ఒక బాలిక మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డు ప్రమాదంలో ఓ బాలిక తీవ్రంగా గాయపడిందని కేశవపట్నం కారోబార్ ఉదయం సమాచారం అందించారని తెలిపారు. సంఘటన స్థలానికి వెళ్లి చూడగా అప్పటికే బాలకను హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారని తెలిసిందని వారు తెలిపారు. మృతి చెందినట్లు సమాచారం తెలుసుకొని మార్చురీకి వెళ్లి పరిశీలించామని తెలిపారు. బాలిక వయస్సు 15 నుంచి 16 సంవత్సరాలు ఉంటుందని, ఆమె మతిస్థిమితం సరిగా లేనట్లుగా తెలుస్తోందని పోలీసులు తెలిపారు. కేశవపట్నం గ్రామపంచాయతీ సెక్రెటరీ నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

కొండగట్టు అంజన్న సన్నిధిలో శ్రావణ సప్తాహం

మల్యాల, ఆగస్టు 9: శ్రావణ సప్తాహ ఉత్సవాల్లో భాగంగా కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో శుక్రవారం స్వామి వారికి రామరక్ష స్తోత్ర అభిషేకం, గులాభి అర్చన, వేంకటేశ్వరస్వామి, అమ్మవారికి అభిషేకార్చన, నాగేంద్రునికి ప్రత్యేక అభిషేకం చేశారు. అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన, ఓడి బియ్యం, వెంకటేశ్వర స్వామికి సేవా నిర్వహించారు. అనంతరం భాగవతం హరికథ చెప్పారు. ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకారంలో స్వామివారు

జాతీయ పతాకం ఎగురవేసి దేశభక్తిని చాటాలి

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



భగత్‌నగర్, ఆగస్టు 9: ప్రతీ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న బండి సంజయ్‌కుమార్ శుక్రవారం పార్లమెంట్ పరిధిలోని బీజేపీ శ్రేణులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలు జెండాలు, ఎజెండాలు పక్కన పెట్టి ప్రతీ ఇంటికి వెళ్లి జాతీయ జెండాను ఎగిరేలా ప్రజలను చైతన్య పరచాలన్నారు. పోలింగ్ బూత్ కమిటీ మొదలు రాష్ట్ర స్థాయినాయుడి వర కు దేశభక్తిని ప్రజల్లో పెంపొందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రతీ ఒక్కరు ప్రధాని మోదీ సహా దేశ భక్తుల ఫొటోలు వాట్సాప్ డీపీలుగా పెట్టుకోవాలన్నారు. పోలింగ్ బూత్ అధ్యక్షులు తప్పనిసరిగా బూత్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి జాతీయ జెండా కొనేలా చేసి పంద్రాగస్టు రోజు ఆయా ఇళ్లపై ఎగురవేసేలా అవగాహన కల్పించాలన్నారు. వంద మందికి సందేశాలు పంపించాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని జాతీయ నేతల విగ్రహాలను శుద్ధి చేయాలన్నారు. ఈ నెల 12న ఉదయం పది గంటలకు కరీంనగర్‌లో నిర్వహించే తిరంగాయాత్రలో తాను పాల్గొంటానని బండి సంజయ్ తెలిపారు. పార్లమెంట్ ఎన్ని కల్లో 80 శాతం పైగా ఓట్లు పోలైన పోలింగ్ బూత్‌ల ఎంపిక పూర్తయిందని ఆ బూత్ కమిటీలను సన్మానించడంతో పాటు నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు.

నేడు రాష్ట్రానికి కేంద్ర మంత్రి : కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ శనివారం హైదరాబాద్‌కు రానున్నారు. ఆదివారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని పలు కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు, అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు కేంద్ర మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

రహదారిపై పడుకుని దివ్యాంగుడి నిరసన

మురికి కాలువ నిర్మాణం చేపట్టాలని వేడుకోలు



రహదారిపై పడుకొని రాజగంగారాం నిరసన

మల్లాపూర్, ఆగస్టు 9 :మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన రాజగంగారాం అనే దివ్యాంగుడు ఇంటి ఎదుట డ్రయినేజి నిర్మాణం చేపట్టాలని శుక్రవారం గ్రామంలోని ప్రధాన రహదారిపై పడుకుని నిరసన తెలిపాడు. గ్రామంలో తన ఇంటి ముందు మురికి కాలువ కోసం తవ్విన గుంత రోజులు గడుస్తున్నా ఎలాంటి పనులూ చేపట్టకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నానని ఆవేదన వ్యక్తం చేస్తూ రహదారిపై పడుకుని నిరసన తెలిపాడు. దీంతో గ్రామంలో సుమారు అరగంట పాటు రోడ్డుకు ఇరువైపుల వాహనాలు ఎక్కడి అక్కడే నిలిచి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఇంటి ముందు ఏడాది క్రితం మురికికాలువ కోసం గుంతను తవ్వారని తెలిపాడు. దివ్యాంగుడినైన తాను ఇంటిలోంచి బయటకు రావాలన్నా పోవాలన్నా కష్టంగా ఉందన్నాడు. త్వరగా నిర్మాణం చేపట్టాలని అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదని వాపోయాడు. ఇటీవల ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అయినా ఎవరు పట్టించుకోకపోవడంతో రోడ్డుపై పడుకున్నట్లు తెలిపాడు. విషయం తెలుసుకున్న రెవెన్యూ పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను త్వరలోనే పరిష్కరించేలా కృషి చేస్తామని తెలపడంతో నిరసన విరమించాడు.



రాజగంగారాం ఇంటి ఎదుట తవ్విన గుంత

భూతగాదాలతో మహిళపై దాడి

ముగ్గురిపై కేసు

మల్యాల, ఆగస్టు 9: భూతగాదాల నేపథ్యంలో ఓ మహిళపై ముగ్గురు దాడికి పాల్పడగా తీవ్ర గాయాల పాలు కావడంతో దాడికి కారకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మ్యాడంపల్లికి చెందిన చిర్ర రాయమల్లు కుటుంబానికి తన వదిన చిర్ర మల్లవ్వ కుటుంబానికి కొంత కాలంగా భూతగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో మల్లవ్వ భూమిని రాయమల్లు దున్నిస్తున్నారనే సమాచారంతో మల్లవ్వ కూతురు వేములవాడ మండలం మారుపాకకు చెందిన పడిగెల బాబాయి శుక్రవారం భూమి వద్దకు వచ్చింది. దీంతో రాయమల్లు అతని భార్య మల్లవ్వ వాళ్ల కొడుకు మనోహర్ అక్కడకు వచ్చిన బాబాయిని దూషించడమే కాకుండా మనోహర్ ఆమే తలను ట్రాక్టర్‌కు బాదడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో బాధితురాలు ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఘనంగా నాగుల పంచమి వేడుకలు


గాజులపల్లిలోని సంతాన నాగేంద్రస్వామి ఆలయంలో భక్తుల పూజలు


రామగిరిలో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

మంథని/మంథనిరూరల్, ఆగస్టు 9: శ్రావణ మాసం తొలి శుక్రవారం, నాగ పంచమి సందర్భంగా మంథనితోపాటు మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీ మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు ప్రజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వేద పండితులు మారుపాక ప్రశాంత్ శర్మ ఆధ్వర్యంలో మహిళా భక్తులు అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు చేశారు. పట్టణంలో నాగులసంది, బోయినిపేట, మండలంలోని గాజులపల్లి శ్రీసంతాన నాగేంద్రస్వామి ఆలయాల్లో భక్తులు నాగపంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పుట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను, అన్నప్ర సాదాన్ని వితరణ చేశారు. వేర్వేరుగా జరిగిన కార్య క్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : సుల్తానాబాద్ పట్టణంలో నాగుల పంచమి, గరుడ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలు వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పుట్టల వద్దకు వెళ్లి పాలు పోసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక పాత బజారులోని శివాలయంలో, హనుమాన్ దేవాలయంలో, వేణుగోపాల స్వామి ఆలయంలో, శాస్త్రినగర్, పెరికిగిద్ద అంజన్న ఆలయాలల్లో, నాగుల పంచమి వేడుకలు నిర్వహించారు. పెద్దపల్లి రోడ్డులోని గుడిమిట్టపల్లి రాజరాజ్వేర స్వామి దేవాలయంలో మహిళలు హాజరై పూజలు చేశారు.

ధర్మారం : మండలంలో శుక్రవారం నాగుల పంచమి వేడుకలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నాగదేవతల పుట్టల వద్దకు మహిళలు తరలివచ్చి పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు.

ఓదెల : నాగుల పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఓదెలతో పాటు పొత్కపల్లి, కనగర్తి, కొమిర, ఇందుర్తి, కొలనూర్, మడక గ్రామాల్లో మహిళలు పుట్టలో పాలు పోసి పుష్పాలను సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

రామగిరి : మండలంలోని పలు గ్రామాల్లో నాగుల పంచామి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.శ్రీకోదండరామాలయంలో మహిళలు పుట్టలో పాలు పోసి నైవేద్యాలను సమర్పించారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని ఆయా గ్రామాల్లో ఆలయాల్లో శ్రావణమాసం శుక్రవారం నాగుల పంచమి సందర్భంగా మహిళలు ఉదయం నుండే పుట్టలో పాలు పోసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. నాగదేవతకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారం నాగుల పంచమి కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కమాన్‌పూర్ : మండల వ్యాప్తంగా నాగుల పంచమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి ఆలయ ఆవరణలోని నాగదేవత విగ్రహానికి మహిళలు క్షీరాభిషేకం చేసి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి మండల కేంద్రంతో పాటు పరిసరాల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

కోల్‌సిటీటౌన్ : నాగులపంచమి గోదావరిఖనిలో భక్తిశ్రద్ధల మధ్య జరిగింది. ఉదయంనుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కోదండ రామాలయం శివాలయం, అయ్యప్పస్వామి ఆలయంలో, సత్యనారాయణస్వామి ఆలయం, పవర్‌హౌస్‌కాలనీలోని శివాలయం సమీపాల్లో పుట్టల వద్ద మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి పాలు, నైవేద్యాలు సమర్పించారు. కాగా, నాగుల పంచమి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

అనాథ చిన్నారులకు ఎల్లవేళలా అండగా ఉంటా..

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 9: అనాథలు చిన్నారులకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండ లంలోని ఆశన్నపల్లిలో ఇటీవల మంద ఐలయ్య, భాగ్యమ్మలు మృతి చెందగా అనాథలైన వారి పిల్లలు అభిలాష్, మనిషాలను ఎమ్మెల్యే విజయరమణారావు, లక్కమారి సంఘం నాయకులు శుక్రవారం పరామర్శించారు. సంఘం నాయకులు అనాథలైన చిన్నారులకు రూ. 75వేల ఆర్థిక సహాయం ఎమ్మెల్యే విజయ రమణారావు చేతుల మీదుగా చిన్నారులకు అందజేశారు.సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసు, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, ఎండీ మునీర్, శివరామకృష్ణ, మాదాసి సతీష్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాలుష్య నివారణకు వనాలను పెంచాలి : ఆర్డీవో గంగయ్య




అప్పన్నపేటలో ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో గంగయ్య, సుల్తానాబాద్‌లో ర్యాలీ, మొక్క నాటి నీరు పోస్తున్న పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 9 :కాలుష్య నివారణకు వనాలను పెంచాలని పెద్దపల్లి ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి గంగయ్య అన్నారు. అప్పన్నపేటలో శుక్రవారం స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో ఆర్డీవోతో పాటు ఎంపీడీవో శ్రీనివాస్, ఏంఈవో సురేంద్రకుమార్, ఏపీవో రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీలత, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, అంగన్‌వాడి టీచర్లు, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్ : పట్టణంలోని పెద్దమ్మనగర్, నాల్గవ వార్డులో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి మొక్కలు నాటారు. కమిషనర్ ఆకుల వెంకటేష్, కొంతం మల్లేశ్వరి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, కౌన్సిలర్లు కొలిపాక సంధ్య చిరంజీవి, షాహిదసాబీర్‌ఖాన్, పాగాల సోనీ శ్రీకాంత్, రాజాం మహంత, మున్సిపల్ మేనేజర్ శివ ప్రసాద్, ఏఈ సతీష్, జూనియర్ అసిస్టెంట్లు రమాకాంత్, అనిల్,సానిటరీ ఇన్స్పెక్టర్లు రామ్మోహన్ రెడ్డి, పులిపాక రాజు వర్క్ ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్, రాముడు, వాణి, తదితరులు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్ : పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత అందరిది అని రామగుండం నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ జై కిషన్‌ఓజా, అధ్యాపకులు సుబ్బారావు, అజయ్‌కుమార్, ఎం.నరేష్, సురేష్, నరేష్, రామకృష్ణ, శ్రీదేవి, సమంత, ఎన్‌సీసీ కెడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛదనం, పచ్చదనంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, మొక్కల ప్రయోజనాలను జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి దోమ ఆదిరెడ్డి వివరించారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసపోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమ తుల ప్రధానోత్సవం జరిగింది. ఇన్‌చార్జి ఎంపీడీవో సురేష్, ఎంపీవో భాస్కర్, అధికారులు పాల్గొన్నారు.



వనమహోత్సవంలో మేయర్ అనిల్‌కుమార్, కమిషనర్ శ్రీకాంత్

సుల్తానాబాద్ : సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో విద్యార్థుల ర్యాలీని చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు శుక్రవారం పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కమిషనర్ శోభాశంకర్, కౌన్సిలర్లు, మేనేజర్ అలీమొద్దీన్, పీహెచ్‌సీ రోజా, బండారి కమలాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గర్రెపల్లి, గట్టేపల్లి, నారాయణపూర్ గ్రామాల్లో వనమహోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, కార్యదర్శులు లచ్చయ్యరమేష్, రవీందర్‌రెడ్డి మొక్కలు నాటారు.

కాల్వశ్రీరాంపూర్ : స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా మొక్కలు నాటడం జరిగింది. మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, ఎంపీడీఓ రామ్మోహనచారి, ఎంపీఓ గోవర్ధన్, డాక్టర్లు శ్రీనివాస్, భావన హెచ్ఈఓ లక్ష్మణ్, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ సరోజన, ఏఎన్ఎంలు, గ్రామ కార్యదర్శిలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకుర్తి : స్వచ్ఛదనం, పచ్చదనంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో వనమహోత్సవాన్ని అధికారులు చేపట్టారు. ఎంపీడీవో పొల్సాని శశికళ, డీఎఫ్‌వో దేవదాసులు బసంత్‌నగర్‌లో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎంపీవో సుదర్శన్, ఫారెస్టు బీట్ ఆఫీసర్ మేఘరాజు, ఏపీవో కొమురయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ దేవాలయం వద్ద అన్నదానం

సుల్తానాబాద్, ఆగస్టు 9: సుల్తానాబాద్ పట్టణంలనోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో శుక్రవారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉమ్మడిజిల్లా సర్పంచ్ ఫోరం మాజీ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్, మాజీ సర్పంచ్ పుష్పలత దంపతులు, వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్ పల్లా మురళి-సదాలక్ష్మి, శివాలయం కమిటీ చైర్మన్ అల్లెంకి సత్యనారాయణ భాగ్యలక్ష్మి తదితరులు పూజలు చేశారు.

విద్యార్థులకు టీషర్ట్స్ పంపిణీ

మంథనిరూరల్, ఆగస్టు 9: మండలంలోని ఎక్లాస్‌పూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుతున్న 150 మంది విద్యార్థులకు అవధానుల అనిల, సునిల, నిఖిల్‌లు టీషర్టులను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రవి దొమ్మటి, ఎంఎన్‌వో హరిప్రసాద్, సామాజికవేత్త కొండల మారుతి, హెచ్ఎం బోనాల రవీందర్, ఉపాధ్యాయులు సుచిత్ర, శ్రీనివాస్, రాజశేఖర్, మంజుల, రాజశేఖ, జ్యోతి, ధనంజయ్‌లు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 9: పెద్దపల్లి మండలంలోని గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన షేక్ అంకుస్(60) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకుస్ కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తిచెంది శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య ఫహీమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్ రావు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

సుల్తానాబాద్, ఆగస్టు 9: మండలంలోని సాంబయ్యపల్లిలో దాశెట్టి అనసూయ(74) అనే వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. కొంతకాలంగా ఆమె వెన్నుపూస నొప్పితో బాధపడుతోంది. గురువారం రాత్రి నొప్పి ఎక్కువ కావడంతో భరించలేక నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను కరీంనగర్ ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. మృతురాలుకు భర్త నారాయణరెడ్డి, కూతురు విజయ ఉన్నారు. కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

క్విట్ ఇండియా డే స్ఫూర్తితో పోరాడుదాం

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 9: క్విట్ ఇండియా డే స్ఫూర్తితో పోరాడాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు పేర్కొన్నారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దపల్లిలో క్విట్ ఇండియా డే నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శులు జి జ్యోతి, ఎస్ రవీందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఆర్ల సందీప్, జిల్లాల ప్రశాంత్, డీవైఎఫ్ఐ జిల్లాఉపాధ్యక్షుడు గోరింకల సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 9: యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రీగల్ షూ మార్టు వద్ద కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ జెండావిష్కరణ చేసి అనంతరం కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కౌటం సతీష్, నాజీమొద్దీన్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, పెద్దెల్లి తేజస్విని, ఎండీ ముస్తాఫా, నాయకులు పెద్దెల్లి ప్రకాష్, నాయిని ఓదెలు, దీటి బాలరాజు, యాకూబ్, కుడిదెల శివ, దూళికట్ట సతీష్, వరలక్ష్మి, అశోక్ పాల్గొన్నారు.

మంథని, ఆగస్టు 9: యూత్ కాంగ్రెస్ అవిర్భావం సందర్భంగా జెండాను శుక్రవారం దుద్దిళ్ల శ్రీనుబాబు ఆవిష్కరించి కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతకు ముందు శ్రీమహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పర్యావరణ ర్యాలీలో పాల్గొన్నారు. పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రు రమ-సురేష్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, కాంగ్రెస్ నేతలు వొడ్నాల శ్రీనివాస్, పోలు శివ, ఎరుకల ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

ఎస్ఐల బదిలీలు

కోల్‌సిటీ, ఆగస్టు 9: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 27మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ శుక్రవారం కాళేశ్వరం జోన్-1 డీఐజీ ఆదేశాలు జారీ చేశారు. మంథని ఎస్‌హెచ్‌ఓగా వీఆర్‌లో తేజాల రమేష్‌ను నియమించారు. అక్కడ పని చేస్తున్న వెంకటకృష్ణను రామగుండం వీఆర్‌కు, ముత్తారం ఎస్ఐగా గోపతి నరేష్‌ను, అక్కడ పనిచేస్తున్న మధుసూదన్‌ను మంచిర్యాల సీసీఎస్‌కు బదిలీ చేశారు. కమాన్‌పూర్ ఎస్‌హెచ్‌ఓగా కే ప్రసాద్‌కు, అక్కడ పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను రామగుండం వీఆర్‌లో పెట్టారు. రామగిరి ఎస్ఐగా పీ చంద్రశేఖర్‌కు, అక్కడ పనిచేస్తున్న సందీప్ కుమార్‌ను గోదావరిఖని వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. కే వేణుగోపాల్ సుల్తానాబాద్-2 ఎస్ఐగా, ఎం మహేందర్‌రెడ్డికి రామగుండం సీసీఆర్‌బీ ఎస్ఐగా పోస్టింగ్‌ఇచ్చారు. టాస్క్ ఫోర్స్‌లో పనిచేస్తున్న కే రమేష్‌ను గోదావరిఖని వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న రామకృష్ణ, హైమకు ఎస్‌బీలో పోస్టింగ్ ఇచ్చారు. హైమకు అదనంగా షీటీమ్ బాధ్యతలు అప్పగించారు. ములుగు జిల్లాలో వీఆర్‌లో ఉన్న కే వెంకటేశ్వర్లుకు గోదావరిఖని టుటౌన్‌కు బదిలీ చేశారు.

కుక్కల పట్టివేత

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 9 : మండలంలోని భోజన్నపేటలో శుక్రవారం పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో వీధి కుక్కలను బంధించారు. ఇటీవల గ్రామంలో నలుగురు వ్యక్తులపై దాడిచేయగా, కోళ్లను, పశువులను గాయపరిచాయి. దీంతో అధికారులు కుక్కలను గ్రామం నుంచి తరలించారు.

మైదాన ప్రాంత ఆదివాసీలకు ఏజెన్సీ చట్టాలు అమలు చేయాలి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 9: మైదాన ప్రాంత ఆదివాసీలకు ఏజెన్సీ చట్టాలు అమలు చేయాలని తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రాల రవీందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక పెద్దపల్లి గిరిజన బాలుర వసతి గృహంలో తుడుం దెబ్బ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా గుర్రాల రవీందర్ మాట్లాడుతూ తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆత్రం కళ్యాణ్, తొడసం తిరుపతి, సోయం రమేష్, సోయం శ్రీనివాస్, సోయం సమ్మయ్య, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్, సుదర్శన్, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన


నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

గోదావరిఖని, ఆగస్టు 9: కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టి బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ శుక్రవారం సీపీఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తాలో ప్ల కార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత సంస్కరణలను వేగవంతం చేసిందన్నారు. రాష్ట్రంలో సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేయడానికి తీవ్రమైన ప్రయత్నాలు చేస్తుందని, దీన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. బొగ్గుబ్లాకులను సింగరేణి సంస్థకే అప్పగించాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 14 వరకు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు తెలియజేయాలని అన్నారు. నిరసనలో ప్రజాసంఘాల పోరాట వేదిక నాయకులు వేల్పుల కుమారస్వామి, ఎరవెల్లి ముత్యంరావు, నాయకురాలు శైలజ, ఆర్ల సందీప్, కొంటు సాగర్, నర్సయ్య, రామాచారి, బిక్షపతి, రాజయ్య, శ్రీనివాస్, బాలకృష్ణ, గణేష్, శివ, శివకుమార్, సురేష్ పాల్గొన్నారు.

దోమ కాటుకు గురికాకుండా చూసుకోవాలి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 9: దోమకాటుకు గురి కాకుండా చూసుకోవాలని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీరాములు సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పనిచేస్తున్న బ్రీడింగ్ చెక్కర్స్ కు సమావేశం నిర్వహించారు. వారు నిర్వహించే కార్యక్రమాలను సమీక్షించి డెంగ్యూ వ్యాధి, దోమల ద్వారా వ్యాప్తి చెందే ఇతర వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై వారికి సూచనలు చేశారు. కార్యక్రమంలో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 9: మండలంలోని మూలసాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ, తెలుగు ఉపాధ్యాయులు మహ్మద్ ఫాజిల్, తుమ్మ లక్ష్మణ్ పదోన్నతిపై బదిలీ కాగా శుక్రవారం ఉపాధ్యాయులను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీ ఉపాధ్యాయులను సత్కరించి మెమొంటోలు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు సర్దార్ అబ్దుల్ జావిద్, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి వెంకన్న నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే 'జననాడి'

ముత్తారం, ఆగస్టు 9: మంథని నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం జననాడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని రామకృష్ణాపూర్‌లో నిర్వహించిన జననాడి కార్యక్రమంలో దుద్దిళ్ల శ్రీనుబాబు పాల్గొని ప్రజల నుంచి పలు సమస్యలపై వినతులను స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు మద్దెల రాజయ్య, మైనార్టి సెల్ మండల అధ్యక్షులు మాజీద్ పాష, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు అల్లం కుమారస్వామి, మాజీ సర్పంచ్ ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు అందజేసిన పూర్వ విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 9: కాల్వశ్రీరాంపూర్ జెడ్‌పీ హైస్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రథమ, ద్వితీయ స్థానంలో మార్కులు పొందిన 8, 9, 10తరగతుల విద్యార్థులకు 1976-77 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఈ సందర్భంగా ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేసి పదవీ విరమణ పొందిన రిటైర్డ్ హెచ్ఎం రావికంటి హరిప్రసాద్ మాట్లాడారు. విద్యార్థులందరికీ స్వీట్స్, స్నాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సునీత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణాన్ని మళ్లించాలి

రామగిరి, ఆగస్టు 9: లద్నాపూర్ పునరావాస గృహాలకు సంబంధించిన డ్రైనేజీ నీటిని పన్నూరు మీది నుంచి కాకుండా మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి మీదుగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ముస్త్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామస్థులు కలెక్టర్ శ్రీహర్ష దృష్టికి తీసుకెళ్లారు. డ్రైనేజీ నిర్మాణం పనులను పన్నూరు గ్రామం నుంచే చేపడతామని సింగరేణి పట్టుపడుతుందని పేర్కొన్నారు. వర్షంతో పాటు డ్రైనేజీ నీరు పెద్దఎత్తున గ్రామంలోకి వచ్చే ప్రమాదం ఉందని కలెక్టర్‌కు నివేదించారు. అనంతరం నిర్వాసిత గ్రామాల ప్రజల సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఎలిగేడులో ఈజీఎస్ ప్రజావేదిక

- 12గ్రామాల్లో రూ. 32,797 రికవరీకి ఆదేశం


ఈజీఎస్ ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

ఎలిగేడు, ఆగస్టు 9: మండల ప్రజాపరిషత్‌లో శుక్రవారం జరిగిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమం జరిగింది. 12 గ్రామాల్లో 32,797 రూపాయల రికవరీకి డీఆర్‌డీవో ప్రాజెక్టు డైరెక్టర్ రవీందరరాథోడ్ ఆదేశించారు. అందులో భాగంగా లాలపల్లి, రూ.3022, నర్సాపూర్ రూ.1000, ముప్పిరితోట రూ.2,366, లోకపేట రూ.260, నారాయణపల్లి రూ.1,992, సుల్తాన్‌పూర్ రూ.472. రాములపల్లి రూ.2609, ధూళికట్ట రూ.194, బురహన్‌మియాపేట్ రూ.11,042, శివపల్లి రూ.7,125, ర్యాకల్‌దేవ్‌పల్లి రూ.168, ఎలిగేడు రూ.1000లు రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ కొంరయ్య, అంబుడ్స్‌పర్సన్ శరత్, గణేష్, ఎంపీడీవో భాస్కర్ రావు, ఎంపీవో మహేశ్వరెడ్డి, పూర్వపు ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఏఈపీఆర్ జగదీశ్వర్, ఏపీవో సదానందం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జిగా సోమారపు లావణ్య


సోమారపు లావణ్య

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 9: బీజేపీ మహిళా మోర్చా మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలిగా గోదావరిఖనికి చెందిన సోమారపు లావణ్యను నియమిస్తూ రాష్ట్ర మహిళా మోర్చ అధ్యక్షురాలు శిల్పారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చే స్తానని, తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డికి, అధ్యక్షురాలు శిల్పారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



ఆర్‌జీ-1 అధికార ప్రతినిధిగా కిరణ్ బాబు

గోదావరిఖని, ఆగస్టు 9: ఆర్‌జీ-1 ఏరియా అధికార ప్రతినిధిగా పర్సనల్ మేనేజర్ టీ కిరణ్ బాబు శుక్రవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా కిరణ్ బాబు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం, పర్సనల్ విభాగం పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు. అధికార ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టడం గొప్ప అవకాశమన్నారు. ఈ కార్యక్రమంలో బంగారు సారంగపాణి, శ్రావణ్ కుమార్, దేవాచారి, నాగేశ్వర్, సాంబశివరావు, రమేష్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

రామగిరి, ఆగస్టు 9: సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని అడ్రియాల ప్రాజెక్టు ఏరియా ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న సీతారామం బదిలీపై కార్పొరేట్‌కు వెళ్తున్న సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారి నాగేశ్వర్‌రావులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సత్యనారాయణ, నాగేశ్వర్‌రావు, రఘురాం, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా స్ఫూర్తిని కొనసాగిద్దాం

రామగిరి, ఆగస్టు 9: సింగరేణి మనుగడ కోసం క్విట్ ఇండియా స్ఫూర్తిని కొనసాగిద్దామని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నేతలు పేర్కొన్నారు. శుక్రవారం ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేముందు స్వదేశీ నినాదం, దేశభక్తి ముసుగుతో అధికారం చేపట్టి స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కట్టబెడుతోందని ఆరోపించారు. సింగరేణిలోని 61 బొగ్గు బ్లాక్‌లను ప్రైవేటీకరణ ప్రక్రియను ప్రారంభించారని పేర్కొన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గోడ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొమ్మటి కొంరయ్య, వెంకటేశ్వర్లు, ఎంఆర్‌సీ రెడ్డి, కేఎన్‌చారి, మంగయ్య, సుగేందర్‌రావు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 9: స్వాతంత్ర్య వేడుకలను ఆర్జీ-2 ఏరియాలో ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని జీఎం సూర్యనారాయణ అధికారులకు సూచించారు. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై వివిధ విభాగాల అధికారులతో జీఎం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జీఎం సూర్యనారాయణ మాట్లాడారు. ఆగస్టు 15న సీఈఆర్ క్లబ్‌లో వేడుకల నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉత్తమ ఉద్యోగులకు సన్మానం, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ప్రధాన ఉత్సవం జరిగే సీఈఆర్ క్లబ్‌తోపాటు గనులు, డిపార్ట్‌మెంట్లపై జాతీయ పతాకాలను ఆవిష్కరించి ఉత్సవాలు జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని జీఎం సూర్యనారాయణ సూచించారు. అఫీషియేటింగ్ ఎస్వోటూ జీఎం సంతోష్ కుమార్, రాజేంద్రప్రసాద్, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జీఎం

నాగేపల్లిలో సోలార్ లైట్ల బిగింపు

రామగిరి, ఆగస్టు 9: మండలంలోని నాగేపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ కొండవేన ఓదెలు ఆధ్వర్యంలో శుక్రవారం సింగరేణి యాజమాన్యం సోలార్ లైట్ల బిగింపు కార్యక్రమాన్ని చేపట్టింది. ఓసీపీ-1 విస్తరణ నేపథ్యంలో 2021లో ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా మాజీ సర్పంచ్ ఓదెలు సింగరేణి ప్రభావిత గ్రామాల్లో సోలార్ లైట్లను ఏర్పాటు చేయాలని సింగరేణి ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు రెమిడేషన్ ప్లాన్ కింద అధికారులు సోలార్ లైట్లను మంజూరు చేశారని ఓదెలు తెలిపారు. అందులో భాగంగా నాగేపల్లి గ్రామంలోని దేవాలయాలు, పాఠశాల, క్రీడా ప్రాంగణం, నర్సరీ, ఎస్సీ కాలనీ, ముదిరాజ్‌కాలనీ, శ్మశాన వాటికల వద్ద సోలార్ లైట్ల బిగింపు కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.

రక్షణ చర్యలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తి చేయాలి

- ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్


కార్మికులతో మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని, ఆగస్టు 9: సింగరేణి ఉద్యోగులు రక్షణ చర్యలను పాటిస్తూ బొగ్గు ఉత్పత్తిని వెలికి తీయాలని ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్ చెప్పారు. శుక్రవారం ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే 11ఇంక్లైన్‌ను సందర్శించారు. ఉద్యోగులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉద్యోగి రక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం గనిలోపల 3వ సీమ్‌లో కంటిన్యూయస్ మైనర్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట ఏజెంట్ చిలుక శ్రీనివాస్, మేనేజర్ మల్లేషం, ఇంజనీర్ రాందాస్, డీవైఎస్ఎస్ హనుమాండ్లు, ఇంజనీర్ రాకేష్ పాల్గొన్నారు.